RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in
# దేశ టైమ్స్
DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | ఆగస్టు 21 శుక్రవారం 2026 | సంపుటి : 16 | సంచిక : 198 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాష
NALGONDA | FRIDAY AUGUST 21 2026 | VOL:16 | ISSUE: 198 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# అసలేంటి సెక్షన్ 22ఏ? పొరపాటు ఎలా జరిగింది?

**తెలంగాణలో వేలాది ప్రైవేట్ ఆస్తులు 22ఏ నిషేధిత జాబితాలో చేరిక**

**రిజిస్ట్రేషన్లు, అమ్మకాలు నిలిచిపోవడంతో యజమానుల ఆందోళన**

**అధికారుల తప్పిదమే కారణమని అంగీకరించిన ప్రభుత్వం**

**సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష, దిద్దుబాటు చర్యలకు ఆదేశం**

**మంత్రి రాజీనామా చేయాలంటూ ప్రతిపక్షాల డిమాండ్**



తెలంగాణ వ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లో వేలాది మంది ప్రైవేట్ ఆస్తుల యజమానులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వారి ఇళ్లు, స్థలాలు, అపార్ట్‌మెంట్లు ఉన్నట్టుండి రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరడంతో అమ్మకాలు, తనఖాలు, బదిలీలు నిలిచిపోయాయి. రెవెన్యూ రికార్డుల నవీకరణలో జరిగిన పరిపాలనా లోపాలే ఈ సంక్షోభానికి కారణమని తేలడంతో ప్రభుత్వం క్షమాపణలు చెప్పి, తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టింది. మరోవైపు, ఈ అంశంపై ప్రతిపక్షాలు

(మిగతా 2వ పేజీలో..)

## మోదీ, అమిత్ షాల రాజకీయ అధ్యాయం ముగిసింది: రాహుల్ గాంధీ



**ఎన్డీయేలో బీజేపీ ఆధిపత్యం క్షీణించిందన్న రాహుల్**

**మోదీ, అమిత్ షా రాజకీయ ఆధిపత్యం తగ్గిందని వ్యాఖ్య**

**కాంగ్రెస్, ఇండియా కూటమి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడి**

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై మరోసారి విమర్శలు గుప్పించారు. ఎన్డీయేలో బీజేపీ రాజకీయ ఆధిపత్యం క్షీణించిందని... మోదీ, అమిత్ షా రాజకీయ ప్రయాణం ముగిసిపోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో బీజేపీకి స్వతంత్రంగా మెజారిటీ లేకపోవడం వల్ల ఆ పార్టీ రాజకీయ శక్తి, పట్టు పూర్తిగా తగ్గిపోయాయని ఆయన విమర్శించారు.

(మిగతా 2వ పేజీలో..)

## దక్షిణాది రాష్ట్రాలు ఏకతాటిపైకి రావాలి.. మన మధ్య బలమైన సహకారం అవసరం: సీఎం విజయ్

**దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారం పెరగాలన్న సీఎం విజయ్**

**డ్రగ్స్ రహిత దక్షిణ భారతం కోసం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపు**

**నదీ జలాల వివాదాల్లో కోర్టు తీర్పులను అమలు చేయాలని విజ్ఞప్తి**

డ్రగ్స్ రవాణాపై ఉమ్మడి పోరాటం, ఆర్థిక కారిడార్ల నిర్మాణం, బ్లూ ఎకానమీ విస్తరణ, దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణ కోసం అన్ని రాష్ట్రాలు సహకారంతో ముందుకు

(మిగతా 2వ పేజీలో..)




## సనత్‌నగర్ 'టిమ్స్'లో అందుబాటులోకి ఇన్‌పేషెంట్ సేవలు.. ఓపీకి భారీ స్పందన

**రేపటి నుంచి ఇన్‌పేషెంట్ సేవలు ప్రారంభం**

**ఫ్యూమిగేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో ఐపీ సేవలకు ఏర్పాట్లు**

**ఓపీకి అనూహ్య స్పందన.. రోజుకు 700 దాటిన రోగుల సంఖ్య**




హైదరాబాద్ సనత్‌నగర్‌లో ఇటీవల ప్రారంభమైన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్)లో ఆగస్టు 21, శుక్రవారం నుంచి ఇన్‌పేషెంట్ (ఐపీ) సేవలు ప్రారంభం కానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఈ ఆసుపత్రిని ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రారంభోత్సవం సందర్భంగా సందర్శకులు ఆపరేషన్ థియేటర్లు, వార్డులను పెద్ద సంఖ్యలో సందర్శించడంతో బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ ముప్పు ఏర్పడింది. దీనిని నివారించేందుకు యాజమాన్యం ఫ్యూమిగేషన్ ప్రక్రియ చేపట్టింది.

(మిగతా 2వ పేజీలో..)

## రైతుల భూ హక్కులకు భూభారతితో భరోసా: మంత్రి పొంగులేటి

ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 20 (దేశ టైమ్స్ )

రాష్ట్రంలో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే భూభారతి చట్టం ఉద్దేశమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సత్తుపల్లి మండలం నారాయణపురంలో గురువారం నిర్వహించిన రైతుల ముఖాముఖి, భూ రీ సర్వేపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.బేతుపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో మొత్తం 12,047 ఎకరాల భూమి ఉండగా,

(మిగతా 2వ పేజీలో..)



# రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ.. పొంగులేటిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్

**22ఏ పేరుతో రెవెన్యూ శాఖలో దందాలు, వేధింపులు సాగుతున్నాయన్న హరీశ్**

**ప్రైవేట్ ఆస్తులపై కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని మండిపాటు**

**రెవెన్యూ శాఖలో 30 శాతం కమీషన్ల రాకెట్ నడుస్తోందని ఆరోపణ**

తెలంగాణలోని రెవెన్యూ శాఖలో నిషేధిత భూముల (22ూఏ) పేరుతో బహిరంగంగా దందాలు, వేధింపులు సాగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు సంచలన బహిరంగ లేఖ రాశారు. ఈ అక్రమాలకు కేంద్ర బిందువుగా ఉన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు.చట్టప్రకారం నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లు అడ్డుకోవాల్సిన 22ఏ నిబంధనను, ప్రైవేట్ ఆస్తులపై కావాలనే కృత్రిమ వివాదాలు సృష్టించి



(మిగతా 2వ పేజీలో..)

## 'శుద్ధీకరణ' ఘటనపై ఖర్గే ఆవేదన.. పార్టీ నేతల మౌనంపై అసంతృప్తి

**హల్ద్వానీ శుద్ధీకరణ ఘటనపై సీడబ్ల్యూసీలో ఖర్గే ఆవేదన**

**సభా వేదిక శుద్ధీకరణ తనను అవమానించిందని రాజ్యసభలో ఆవేదన**



బాధ్యులపై అంటరానితనం నిరోధక చట్టం కింద చర్య తీసుకోవాలని విన్నపం ఘటన దురదృష్టకరమన్న జేపీ నడ్డా ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో తన సభ జరిగిన ప్రదేశాన్ని

తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



## సనత్‌నగర్ 'టిమ్స్'లో అందుబాటులోకి ఇన్‌పేషెంట్ సేవలు.. ఓపీకి భారీ స్పందన

(మొదటి పేజీ తరువాయి)

గురువారంతో మొదటి దశ ముగియనుండటంతో శుక్రవారం నుంచి ఐపీ సేవలను మొదలుపెట్టనున్నారు. మరికొన్ని దశల్లో ఫ్యూమిగేషన్ పూర్తిచేసి, బ్యాక్టీరియా పూర్తిగా తొలగిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత శస్త్రచికిత్సలు కూడా ప్రారంభిస్తారు. ఇందుకు మరో రెండు, మూడు వారాల సమయం పట్టే అవకాశం ఉంది. మరోవైపు, టిమ్స్‌లో ఔట్ పేషంట్ (ఓపీ) సేవలకు రోగుల నుంచి భారీ స్పందన వస్తోంది. ట్రయల్ రన్ సమయంలో రోజుకు 200 మంది రాగా, బుధవారం ఈ సంఖ్య 700 దాటింది. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఓపీ రిజిస్ట్రేషన్లు స్వీకరిస్తూ.. మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యులు సేవలు అందిస్తున్నారు.

## మోదీ, అమిత్ షాల రాజకీయ అధ్యాయం ముగిసింది: రాహుల్ గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

గతంలో చూపిన రాజకీయ ఆధిపత్యాన్ని మోదీ, అమిత్ షా జోడీ ఇప్పుడు కోల్పోయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ, 'ఇండియా' కూటమి మరింత వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలపై పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని, రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## దక్షిణాది రాష్ట్రాలు ఏకతాటిపైకి రావాలి.. మన మధ్య బలమైన సహకారం అవసరం: సీఎం విజయ్

(మొదటి పేజీ తరువాయి)

సాగాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పిలుపునిచ్చారు. మహాబలిపురంలో 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. దేశ జీడీపీలో 30 శాతానికి పైగా వాటా కలిగిన దక్షిణాది రాష్ట్రాలు తయారీ, ఎగుమతులు, సేవల రంగాల్లో కేంద్రంగా నిలుస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. ఆర్థిక కూటమిగా ఎదగాలి తయారీ జోన్లు, లాజిస్టిక్స్ పార్కులు, ఫ్రైట్ కారిడార్ల ద్వారా దక్షిణ ప్రాంతం ఒక సమీకృత ఆర్థిక కూటమిగా పనిచేయాలని సీఎం విజయ్ ఆకాంక్షించారు. బెంగళూరులోని బొమ్మసంద్ర నుంచి హోసూర్ వరకు మెట్రో రైలు విస్తరణను స్వాగతించిన ఆయన, ఇది అంతర్రాష్ట్ర సహకారానికి ఒక నమూనా అని అభివర్ణించారు. ఈ పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. 'డ్రగ్స్ రహిత దక్షిణ భారతం' కోసం మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా సమాచారాన్ని పంచుకుంటూ, కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలపై నియంత్రణ, అనధికార పంపిణీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సముద్ర తీరంతో అభివృద్ధి

దక్షిణాది అభివృద్ధిలో బ్లూ ఎకానమీకి ప్రాధాన్యత ఇవ్వాలని విజయ్ అన్నారు. 1,076 కిలోమీటర్ల తీరప్రాంతం ఉన్న తమిళనాడు.. పోర్టులు, తీరప్రాంత నౌకాయానం, మత్స్య పరిశ్రమ, సముద్ర ఆధారిత పరిశ్రమలు, పర్యాటకం వంటి రంగాల్లో ఇతర రాష్ట్రాలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఆర్థిక సమాఖ్య విధానంపై మాట్లాడుతూ.. రాబోయే ఫైనాన్స్ కమిషన్ నిధుల కేటాయింపులో రాష్ట్రాల అవసరాలు, పనితీరు రెండింటినీ పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. జనాభా నియంత్రణలో విజయవంతమైన రాష్ట్రాలకు నష్టం జరగకూడదని, జీఎస్టీ తర్వాత పన్ను రేట్లను నిర్ణయించుకునే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉండాలని అన్నారు. నీట్, నదీ జలాలపై స్పష్టమైన వైఖరి అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల్లో కోర్టు తీర్పులు, ట్రైబ్యునల్ అవార్డులను అమలు చేయడం ద్వారా దిగువ రాష్ట్రాల హక్కులను కాపాడాలని విజయ్ డిమాండ్ చేశారు. కావేరీ జలాల విషయంలో ఆదేశాలను సకాలంలో అమలు చేయాలని, ముల్లపెరియార్ డ్యామ్ భద్రత, నీటి నిల్వను 152 అడుగులకు పెంచే అంశం న్యాయస్థానాల నిర్ణయాల మేరకే జరగాలని స్పష్టం చేశారు. నీట్ పరీక్షపై తమిళనాడు వ్యతిరేకతను పునరుద్ఘాటించిన ఆయన.. ఇది గ్రామీణ, పేద విద్యార్థులకు నష్టం చేస్తుండటంతో రాష్ట్ర కోటాలోని మెడికల్, డెంటల్, ఆయుష్ సీట్లను 12వ తరగతి మార్కుల ఆధారంగా భర్తీ చేసేందుకు అనుమతించాలని కేంద్రాన్ని కోరారు.జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన కారణంగా డీలిమిటేషన్ ప్రక్రియలో ఏ రాష్ట్రం కూడా పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని కోల్పోకుండా చట్టపరమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. "బలమైన రాష్ట్రాలతోనే దేశం బలోపేతమవుతుంది. విభేదాలను చర్చలు, పరస్పర గౌరవం, చట్ట పాలన ద్వారా పరిష్కరించుకోవడానికి తమిళనాడు సిద్ధంగా ఉంది" అని ఆయన చెప్పుకొచ్చారు.

## రైతుల భూ హక్కులకు భూభారతితో భరోసా: మంత్రి పొంగులేటి

(మొదటి పేజీ తరువాయి)

శుద్ధి చేయడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లోని పలువురు నేతలు బహిరంగంగా స్పందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలను ఉటంకిస్తూ ఎన్డీటీవీ వెల్లడించింది.ఆగస్టు 8న హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో ఖర్గే 'విజయ్ శంఖనాద' సభలో పాల్గొన్నారు. రెండు రోజుల తర్వాత ఆగస్టు 10న 'శ్రీరామ్ సేన'కు చెందిన కార్యకర్తలు అక్కడ శుద్ధి హోమం నిర్వహించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది.ఢిల్లీలో బుధవారం జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఖర్గే ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. ఘటన జరిగిన తర్వాత పలువురు సీడబ్ల్యూసీ సభ్యులు తనకు బహిరంగంగా మద్దతు ఇవ్వలేదని ఆయన బాధపడ్డారని పార్టీ వర్గాలు తెలిపాయి.అయితే ఖర్గే ఎవరినీ ప్రత్యేకంగా పేరుపెట్టి విమర్శించలేదని సమాచారం. కొందరు సీనియర్ నేతలు ఈ ఘటనపై గట్టిగా స్పందించకపోవడంపై ఆయన అసంతృప్తిగా ఉన్నట్లు సమావేశంలో వ్యవహరించిన తీరును బట్టి తెలుస్తోందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.ఈ అంశాన్ని ఖర్గే గురువారం రాజ్యసభలో కూడా ప్రస్తావించారు. హల్ద్వానీలో తన సభ వేదికను శుద్ధి చేయడం తనను అవమానించినట్లుగా అనిపించిందని అన్నారు. "నన్ను రక్షించండి అని ఎవరినీ అడగలేదు. ఖర్గే వ్యాఖ్యలపై రాజ్యసభలో కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందించారు. హల్ద్వానీ ఘటన దురదృష్టకరమని అన్నారు. ఈ ఘటనలో బీజేపీ నేతలు, కార్యకర్తలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. దీనిపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు. మరోవైపు కాంగ్రెస్ మాత్రం శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించిన వారికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలు ఉన్నాయని ఆరోపించింది. ఈ ఘటన వెనుక దళితుల పట్ల వివక్షతో కూడిన ఆలోచనా ధోరణి ఉందని విమర్శించింది. బీజేపీ మాత్రం ఆ కార్యక్రమానికి దూరంగా ఉంటూ శుద్ధీకరణ చర్యను ఖండించింది.

# రైతుల భూ హక్కులకు భూభారతితో భరోసా: మంత్రి పొంగులేటి

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే సుమారు 6 వేల ఎకరాల రీ సర్వే పూర్తయిందని మంత్రి తెలిపారు. మిగిలిన భూమికి కూడా సర్వే పూర్తి చేస్తామని చెప్పారు. రీ సర్వేలో రైతులకు ఏవైనా అభ్యంతరాలు లేదా లోపాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతుల అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాతే తుది భూ హక్కుల నమోదు చేపడతామని స్పష్టం చేశారు.రీ సర్వే అనంతరం 30 రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరిస్తామని, వాటిని పరిష్కరించిన తర్వాత తుది హక్కులను నమోదు చేస్తామని మంత్రి తెలిపారు. ప్రతి భూమికి ఖచ్చితమైన కోఆర్డినేట్లు, మ్యాప్ రూపొందించి భూ హక్కులను నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఆధార్ తరహాలో భూధార్ కార్డులు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.వ్యవసాయ భూములకు వెళ్లే దారులను ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోకుండా పరిరక్షించాలని అధికారులను ఆదేశించారు. దారులకు పట్టాలు ఇవ్వొద్దని, వాటిని రైతుల భూముల్లో భాగంగా నమోదు చేయరాదని స్పష్టం చేశారు. పొలాలకు వెళ్లేందుకు అవసరమైన అప్రోచ్ రోడ్లు, దారులను కాపాడాలని సూచించారు. చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, వాటి హద్దులను స్పష్టంగా గుర్తించాలని ఆదేశించారు.బేతుపల్లి రెవెన్యూ గ్రామంలో సుమారు 2,026 ఎకరాల అసైన్డ్ భూమి ఉందని, అందులో సుమారు 980 ఎకరాలను పేదలకు పంపిణీ చేసినట్లు మంత్రి వివరించారు. మిగిలిన అసైన్డ్ భూముల్లో సాగు చేస్తున్న అర్హులైన రైతుల హక్కులను కూడా నిబంధనల ప్రకారం పరిరక్షిస్తామని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి భూ రీ సర్వే చేపట్టామని మంత్రి వెల్లడించారు. వచ్చే ఏడాదిన్నరలో వ్యవసాయ భూములు, ఆబాది ఆస్తుల రీ సర్వేను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు.భూముల విషయంలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ముఖ్యంగా అమాయక ప్రజలను అడ్డుపెట్టుకుని 22ఏ భూములను అక్రమంగా క్రమబద్ధీకరించుకునే ప్రయత్నాలను సహించబోమన్నారు. ఇప్పటికే కొన్ని అక్రమాలపై చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు.గతంలో ధరణి సమయంలో అర్హత లేని వ్యక్తులకు కూడా పట్టాదారు పాస్‌బుక్‌లు వచ్చిన ఘటనలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. నాగార్జునసాగర్ పైలట్ ప్రాజెక్టు పరిధిలో నిర్వహించిన సర్వేలో సుమారు 3,400 నకిలీ పట్టాదారు పాస్‌బుక్‌లు గుర్తించినట్లు తెలిపారు. భూమి రైతులకు అత్యంత కీలకమైన అంశమని, ఇది రాజకీయాలకు అతీతమైన విషయమన్నారు. రైతులు రీ సర్వే ప్రక్రియకు సహకరించాలని మంత్రి కోరారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో భూ సమస్యలు లేని పరిస్థితి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, డీఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అసలేంటి సెక్షన్ 22ఏ? పొరపాటు ఎలా జరిగింది?

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర విమర్శలు చేస్తున్నాయి.

**అసలేంటి సెక్షన్ 22ఏ? పొరపాటు ఎలా జరిగింది?**

రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22ఏ ప్రకారం ప్రభుత్వ భూములు, దేవాదాయ, వక్ఫ్ ఆస్తులు, అసైన్డ్ భూములు, భూదాన భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వ ఆస్తులను అక్రమ బదిలీల నుంచి కాపాడటమే దీని ముఖ్య ఉద్దేశం. అయితే, ధరణి పోర్టల్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'భూ భారతి' విధానంలోకి మారే క్రమంలో, 2026 ఏప్రిల్‌లో రెవెన్యూ శాఖ నిషేధిత ఆస్తుల జాబితాను నవీకరించింది. ఈ ప్రక్రియలో అధికారులు సరైన పరిశీలన లేకుండానే జాబితాలను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపారు. ఒకే సర్వే నంబర్‌లో కొంత భాగం ప్రభుత్వ భూమి ఉంటే, ఆ సర్వే నంబర్‌లోని మొత్తం ప్రైవేట్ పట్టా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చడంతో ఈ గందరగోళం తలెత్తింది.హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ఖరీదైన ప్రాంతాలతో పాటు, దశాబ్దాల క్రితం హుడా, హెచ్ఎండీఏ అనుమతులతో ఏర్పడిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు కూడా ఈ జాబితాలో చేరాయి. రిజిస్ట్రేషన్ కోసం వెళ్లినప్పుడే తమ ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నాయని యజమానులకు తెలియడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే సుమారు 6,000 కేసులు హైకోర్టులో నడుస్తున్నాయి.

**ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు**

ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, అధికారుల నిర్లక్ష్యం, పొరపాట్ల వల్లే ఇది జరిగిందని అంగీకరించారు. నిజమైన యజమానులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు తెలిపారు. సమస్య పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఫిర్యాదుల కోసం టోల్-ఫ్రీ నంబర్ (1800-599-4788) కూడా ప్రారంభించామని ప్రకటించారు. ఫిర్యాదు అందిన మూడు రోజుల్లో స్పందిస్తామని హామీ ఇచ్చారు.మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంపై మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న ఆస్తుల వివరాలను రెండు రోజుల్లో ధృవీకరించి, అవి ప్రైవేట్ ఆస్తులని తేలితే వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించారు. "ఒక్క అంగుళం ప్రైవేట్ భూమికి కూడా నష్టం జరగనివ్వం" అని స్పష్టం చేస్తూ, దళారులను ఆశ్రయించవద్దని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటికే మేడ్చల్-మల్కాజ్‌గిరిలో 30, రంగారెడ్డిలో 4 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి.

**ప్రతిపక్షాల విమర్శలు**

ఈ పరిణామంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని, డిసెంబర్ 2023 నుంచి జాబితాలో చేర్చిన ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్ చేశారు. జాబితా నుంచి పేర్లు తొలగించడానికి కొందరు అధికారులు కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు తెలంగాణ భవన్‌లో లీగల్ ఎయిడ్ సెల్‌ను ప్రారంభించారు. బీజేపీ నేతలు కూడా ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్దేశపూర్వకంగా ఏ ఒక్క ప్రైవేట్ ఆస్తిని జాబితాలో చేర్చలేదని, కేవలం పొరపాట్లను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. బాధిత యజమానులు తమ ఆస్తుల వివరాలను అధికారిక వెబ్‌సైట్లలో చూసుకోవాలని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మార్గాలను వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



# రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ.. పొంగులేటిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

డబ్బులు గుంజడానికి వాడుకుంటున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ నుంచి ప్రారంభించి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హెచ్ఎండీఏ (నవీణూ) అనుమతులు ఉన్న వేలాది ప్లాట్లు, నివాసాలను ఏకపక్షంగా నిషేధిత జాబితాలో చేర్చి సామాన్యులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల క్రితమే క్రమబద్ధీకరించిన అర్బన్ ల్యాండ్ సీలింగ్ (ఖూజ) భూములను, క్లియర్ రిజిస్టర్డ్ పత్రాలు ఉన్న ఆస్తులను మళ్లీ నిషేధిత జాబితాలో చేర్చడం తీవ్ర దుర్మార్గమని విమర్శించారు. రెవెన్యూ శాఖలో ఏకంగా 30 శాతం కమీషన్ల రాకెట్ నడుస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. ఒకసారి 22ఏ జాబితాలో పెట్టిన భూములను మళ్లీ తొలగించాలంటే మార్కెట్ విలువలో 30 శాతం కమీషన్లు ఇవ్వాలని దళారులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేకించి ఓఆర్ఆర్ పరిసరాల్లో ఉన్న అత్యంత విలువైన భూములను బ్లాక్ చేసి, రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లకు ఒప్పుకోవాలని యజమానులపై ఒత్తిడి తెస్తున్నారని ధ్వజమెత్తారు. యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను ఈ జాబితాలో పెట్టారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంగా బయటపెట్టినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 22ఏ జాబితాలో కొత్తగా చేర్చిన, అలాగే తొలగించిన ప్రతి భూమి వివరాలపై హైకోర్టు మాజీ న్యాయమూర్తితో స్వతంత్ర విచారణ, ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలని కోరారు. జిల్లాల వారీగా ఈ నిషేధిత భూముల జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచి పారదర్శకత నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ఒక అవినీతి మంత్రిని కాపాడేందుకు ప్రజల నమ్మకాన్ని పణంగా పెడుతున్నారని, రాహుల్ గాంధీ వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

దేశ టైమ్స్
తెలుగు దినపత్రిక
సత్యం కోసం .... సమాజం కోసం



# మాజీమంత్రి రెడ్యా నాయక్ జన్మదిన వేడుకలు





**● ఉగ్గంపల్లిలో గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు**

**(దేశ టైమ్స్) మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 20**

మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామంలో డోర్నకల్ నియోజకవర్గ మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్యా నాయక్‌ను గజమాలతో సత్కరించి, శాలువా కప్పి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధికి రెడ్యా నాయక్ చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేసుకున్నారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. రాజకీయంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు మాట్లాడుతూ.. రెడ్యా నాయక్ మరింత కాలం ప్రజా జీవితంలో కొనసాగుతూ ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, సీనియర్ కాంట్రాక్టర్ రామడుగు అచ్యుతరావు, మాజీ ఎంపీపీ గుగులోతు వెంకన్న తదితరులు రెడ్యా నాయక్‌ను గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రెడ్యా నాయక్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తల రాకతో ఉగ్గంపల్లిలో సందడి వాతావరణం నెలకొంది. రెడ్యా నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు నాయకులు, అభిమానులు ఆయనకు ఫోన్ ద్వారా, ప్రత్యక్షంగా శుభాకాంక్షలు తెలిపారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

**మరిపెడలో ఘనంగా జయంతి వేడుకలు.. భారీ ర్యాలీ**
**కేక్ కట్ చేసి నివాళులర్పించిన కాంగ్రెస్ శ్రేణులు**

**(దేశ టైమ్స్)మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 20**

దేశ మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మరిపెడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డితో కలిసి మరిపెడ మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ముఖ్యంగా యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించడంతో పాటు సాంకేతిక రంగంలో దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ అభివృద్ధికి బాటలు వేశాయని అన్నారు.

**యువతకు స్ఫూర్తిదాయకుడు**

రాజీవ్ గాంధీ దేశంలో సాంకేతికతకు పెద్దపీట వేసి ఆధునిక భారత నిర్మాణానికి పునాదులు వేశారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, యువతకు అవకాశాలు, సమాచార సాంకేతిక రంగం అభివృద్ధి వంటి అంశాల్లో ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ పురోగతికి ఎంతో దోహదపడ్డాయని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు**

జయంతి సందర్భంగా నిర్వహించిన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాగింది. కాంగ్రెస్ జెండాలు చేతబట్టి, రాజీవ్ గాంధీకి జోహార్లు అర్పిస్తూ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన కేక్ కటింగ్ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో మరిపెడ పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.రాజీవ్ గాంధీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి



కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని, ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుగులోత్ రవి నాయక్, టౌన్ ప్రెసిడెంట్ పానుగోతు రాంలాల్, కేసముద్రం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలమల్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి, డీసీసీ మెంబర్ కుడితి నర్సింహా రెడ్డి , మండల యూత్ అధ్యక్షుడు జరుకుల విజయ నాయక్,మున్సిపల్ కౌన్సిలర్లు జాటోత్ సురేష్, మెరుగు రాము, జియో రమేష్, నీలా లచ్చిరామ్, కాంతమ్మ కరణ్ సింగ్, పానుగోతు రాములు కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే కో-ఆప్షన్ సభ్యులు గుండగాని వెంకన్న, షేక్ ఆజిజ్, షేక్ సలీమా తాజోద్దీన్ పాల్గొన్నారు.సర్పంచులు పెండ్లి శ్రీనివాస్ రెడ్డి, తొట్టి గౌతమ్, బద్రు, నరేందర్తో పాటు కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజీవ్ గాంధీకి ఘన నివాళులర్పించారు.

# సూరమ్మ ప్రాజెక్ట్ భూ నిర్వాసితులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి

**రుద్రంగి ఆగస్టు20(దేశ టైమ్స్)**

బహుజన సమాజ్ పార్టీ నాయకులు రుద్రంగి గ్రామం లోని కలికోట సూరమ్మ ప్రాజెక్ట్ సందర్శించారు, సూరమ్మ ప్రాజెక్ట్ లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు కుటుంబానికీ ఒక ప్రభుత్వ ఉద్యోగం లేదా ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి అని చట్టబద్ధంగా వారికి రావాల్సిన బెనిఫిట్స్ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు, ఇంకా చాలా కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది అని వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్రస్తుత మార్కెట్ విలువ అనుసరించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్ పనులు వేగంగా జరుగడం లేదు అని ప్రాజెక్ట్ పనులు వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని. లేని పక్షంలో బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ప్రభుతాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కట్కూరి రమేష్, రుద్రంగి మండల అధ్యక్షుడు దయ్యాల ఉదయ్, మండల ఉపాధ్యక్షుడు ఏనుగందుల సతీష్, రుద్రంగి గ్రామ ప్రధాన కార్యదర్శి లింగాల రవీందర్ కోశాధికారి లింగంపెల్లి సుదర్శన్, కదాసు మహేందర్ అనిల్,కట్కూరి హనోక్, తదితరులు పాల్గొన్నారు.



# రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**రుద్రంగి ఆగస్టు20(దేశ టైమ్స్)**



రుద్రంగి మండల మండల కేంద్రంలోని ఇందిరా చౌక్ లో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రం గంగ నర్సయ్య ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎర్రం గంగా నర్సయ్య మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, కమ్యూనికేషన్, టెక్నాలజీ రంగాల్లో గట్టి పునాదులు వేశారన్నారు. రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. బడుగు బలహీన వర్గాలు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలంటే ఒక కాంగ్రెస్ వల్లే సాధ్యమన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి మాట్లాడుతూ గ్రామస్థాయిలో పాలన అందించడానికి పంచాయతీల వ్యవస్థను బలపరిచేందుకు రాజీవ్ గాంధీ కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, సర్పంచ్ గండి నారాయణ, ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, మాజీ జెడ్పిటిసి గట్ల మీనయ్య, లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ సామ మోహన్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, ఆత్మ కమిటీ డైరెక్టర్ కట్కూరి దాసు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తర్రె లింగం, వార్డు సభ్యులు శీలం స్వాతి-మీనయ్య, పూన్నూరు శ్రీనివాస్, పుట్కపు భవాని- మహిపాల్ రెడ్డి, నాయకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, కేసిరెడ్డి నర్సారెడ్డి, పల్లి గంగాధర్, సనుగుల గంగాధర్, కొమిరి శంకర్, పిడుగు లచ్చిరెడ్డి, ఎర్రం రాజలింగం, చెలుకల శ్రీకాంత్, పల్లికొండ వినయ్, అక్కనపల్లి శ్రీనివాస్, తర్రె సుదర్శన్, అల్లూరి లచ్చిరెడ్డి, బొల్లి దేవేందర్, గణేష్, ధర్నా మల్లేశం, శ్రీహర్ష గౌడ్, రామకృష్ణ, మోతే నర్సయ్య, నేదురి సునీల్, గోడికారి హిరోజ్, లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# డొంక ఆక్రమణలను వెంటనే తొలగించాలి: సీపీఐ నాయకులు

**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 20 (దేశ టైమ్స్):**




మధిర మున్సిపాలిటీ పరిధిలోని విజయవాడ రోడ్డుకు ఆనుకుని ఉన్న 100 అడుగుల డొంక రోడ్డును ఆక్రమణల నుంచి రక్షించి, అక్రమ కబ్జాలను వెంటనే తొలగించాలని సీపీఐ నాయకులు బెజవాడ రవి అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్‌కు సీపీఐ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. మధిర నుంచి ఇల్లందులపాడు మీదుగా దెందుకూరు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఆనుకుని ఉన్న డొంక రోడ్డును కొందరు ఆక్రమించి వ్యాపార సముదాయాలు నిర్మించారని, మరికొందరు తమ భూముల హద్దులను మార్చి రాళ్లు పాతి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్నారని బెజవాడ రవి ఆరోపించారు. ఈ విషయాన్ని గతంలో సీపీఐ నాయకత్వం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆగస్టు 2023లో జిల్లా సర్వేయర్ ద్వారా సర్వే నిర్వహించి ఆక్రమణకు గురైన భూమిని గుర్తించినప్పటికీ, ఇప్పటివరకు మండల అధికారులు, మధిర మున్సిపల్ పాలకవర్గం, అధికారులు ఆక్రమణలను తొలగించకపోవడం దారుణమన్నారు. మధిర మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత డొంక రోడ్డు ఆక్రమణలు విచ్చలవిడిగా పెరిగాయని ఆయన ఆరోపించారు. కొందరు పాలకవర్గ సభ్యులు, అధికారులు ఆక్రమణదారులతో కుమ్మక్కై విలువైన ప్రభుత్వ భూమిని కబ్జాకు గురిచేస్తున్నారని విమర్శించారు. ప్రజల అవసరాలకు ఉపయోగపడాల్సిన డొంక రోడ్డును తక్షణమే సర్వే చేయించి, ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని బెజవాడ రవి డిమాండ్ చేశారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించకపోతే ఇళ్ల స్థలాల కోసం రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పేద ప్రజలు, ఇంటి స్థలాల కోసం పోరాడుతున్న పేద జర్నలిస్టులను కలుపుకుని సీపీఐ ఆధ్వర్యంలో భూపోరాటం చేపడతామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాన్ని పేద ప్రజలకు, పేద జర్నలిస్టులకు వినియోగించేలా పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.

# మానాలలో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**రుద్రంగి ఆగస్టు20(దేశ టైమ్స్)**

మానాలలో మాజీ ప్రధానమంత్రి, భారతరత్న శ్రీ రాజీవ్ గాంధీ గారి జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్ జలపతి మాట్లాడుతూ భారతదేశాన్ని ఆధునిక, సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు రాజీవ్ గాంధీ గారు విశేష కృషి చేశారు ముఖ్యంగా కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు యువతే దేశ భవిష్యత్తు అని నమ్మి, యువత అభివృద్ధికి అనేక కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పించారు అని అలాగే 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించడంలో కీలక పాత్ర పోషించారు.ఆధునిక భారతదేశ నిర్మాణానికి రాజీవ్ గాంధీ గారు అందించిన సేవలు చిరస్మరణీయం. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో మానాల ఉపసర్పంచ్ దాసరి అశోక్ AMC డైరెక్టర్ కొమ్ముల రవీందర్ ,DCC బానోత్ రాందాస్ నాయక్ మండల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## జాతీయ స్థాయి క్యారమ్ పోటీలో మనాల విద్యార్థికి ప్రథమ బహుమతి

**రుద్రంగి ఆగస్టు20(దేశ టైమ్స్)**



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మనాల గ్రూరూ పాఠశాల 10వ తరగతి విద్యార్థి మాలోతు వంశీ జాతీయ స్థాయి క్యారమ్ పోటీలో ప్రథమ బహుమతి సాధించి సత్తా చాటాడు. ఢిల్లీలో నిర్వహించిన నేషనల్ క్యారమ్ బోర్డు పోటీలో ప్రతిభ కనబరిచి ఫస్ట్ ప్రైజ్ కైవసం చేసుకున్నాడు. విద్యార్థి విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, రుద్రంగి ఎంఈఓ రామకృష్ణ, పీఈటీ నవీన్ కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి తూమ్ జలపతి, మానాల గ్రామ సర్పంచ్ బుర్ర శంకర్, ఉపసర్పంచ్ దాసర అశోక్, గ్రామ కార్యదర్శి, గ్రామ యువకులు పాల్గొన్నారు. వంశీ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి: సిర్పంగి స్వామి

**వలిగొండ, ఆగస్టు 20 (దేశ టైమ్స్)**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు. గురువారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహాశీల్దార్ దశరథ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి యువతకు ఖాళీగా ఉన్న పోస్టులు అన్నిటిని భర్తీ చేస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలంటూ కేంద్ర ప్రభుత్వం గద్దెనెక్కి ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసం చేస్తున్నాయని, నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పోరాడుతుంటే వారిని దేశద్రోహులని ముద్ర వేసేందుకు కుట్ర చేస్తుందన్నారని అన్నారు. ప్రభుత్వాలు వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యూత్ డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మద్దెల రాజయ్య, మెరుగు వెంకటేశం, కూర శ్రీనివాస్, కలుకూరి రామచందర్, గర్దాసు నరసింహ, నాయకులు రాధారపు మల్లేశం, కొండూరు సత్తయ్య, వేముల చంద్రయ్య ,శీలం ఇందిర, వేముల లక్ష్మయ్య, గంగాపురం వెంకటేశం, మైసోల్ల నరేందర్, దొడ్డి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు విధులలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

**వలిగొండ, ఆగస్టు 20 (దేశ టైమ్స్)**

అధికారులు విధులలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు అని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం మండలంలోని వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రిలో సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రి పరిసరాలలో పారిశుద్ధ్యం, మొక్కల పెంపకంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని,అనంతరం రికార్థులను పరిశీలించి సిబ్బంది అందుబాటులో ఉన్నారా అని తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలను, నమోదవుతున్న కేసుల వివరాల రికార్డులు పరిశీలించారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం అరూర్ పిహెచ్సిని, అంగన్వాడి కేంద్రం, చేయూత పింఛన్లను, గ్రామ పంచాయతీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎరుపుల వెంకటేశం, ఎంపిడిఓ జలంధర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి ప్రేమలత, ఏపీఓ పరశు రాములు, వైద్యురాలు వేణుమాదవి,పంచాయతీ కార్యదర్శులు డి.రమేష్, క్రాంతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండించిన ఎల్‌హెచ్‌పీఎస్

**పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం**

**విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**

**ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమా నాయక్ డిమాండ్**

**(దేశ టైమ్స్) మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 20**



తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం అందజేయడానికి ప్రయత్నించిన విద్యార్థులపై పోలీసులు దాడి చేయడం తీవ్రంగా ఖండించదగిన విషయమని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) నాయకులు అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు వారితో మాట్లాడి సమస్యను తెలుసుకోవాల్సింది పోయి పోలీసులతో అడ్డుకోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్ తీవ్రంగా స్పందించారు. విద్యార్థులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం ఇవ్వాలనుకుంటే వారిపై పోలీసులు దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యను జిల్లా కలెక్టర్ స్వయంగా విని, పరిష్కరిస్తామని ఒక్క మాట చెప్పి ఉంటే ఇలాంటి పరిస్థితి ఏర్పడేది కాదని అన్నారు.“జిల్లా కలెక్టర్ వచ్చి సమస్యను పరిష్కరిస్తామని ఒక్క మాట చెప్పి ఉంటే ఈ న్యూసెన్స్ ఉండేది కాదు. న్యూసెన్స్ చేసింది పోలీసులే” అని భీమా నాయక్ మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ముఖ్యంగా విద్యార్థుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు.

**రాజ్యాంగ హక్కులను కాపాడాలి**

జిల్లా పరిపాలన వ్యవస్థ, పోలీస్ వ్యవస్థ తమ చేతుల్లో ఉందని భావించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తే దానిని రాజ్యాంగం ఒప్పుకోదని భీమా నాయక్ అన్నారు. “ఏం చేసినా నడుస్తుంది అనుకుంటే కుదరదు” అని ఆయన హెచ్చరించారు. విద్యార్థులపై దాడి చేసిన ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థులు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రంతో అధికారులను కలిసేందుకు వచ్చారని, వారి నుంచి వినతిపత్రం తీసుకుని సమస్యను పరిశీలించి పరిష్కరించే అవకాశం అధికారులకు ఉందని అన్నారు. కనీసం జిల్లా కలెక్టర్ విద్యార్థుల వినతిపత్రం తీసుకునే సమయం కూడా లేదా? అని ప్రశ్నించారు. విద్యార్థులతో అధికారులు చర్చలు జరిపి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

**క్షమాపణ చెప్పకుంటే ఆందోళన**

విద్యార్థులపై జరిగిన దాడికి పోలీసులు వెంటనే క్షమాపణ చెప్పాలని ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు డిమాండ్ చేశారు. “పోలీసులకు ఒక్కటే చెబుతున్నాం.. రేపు ఉదయం 10 గంటలలోపు విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలి. లేదంటే అదే విద్యార్థులతో పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తాం” అని గుగులోతు భీమా నాయక్ స్పష్టం చేశారు.విద్యార్థులపై దాడికి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులు లేవనెత్తిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనను అణచివేయడం కాకుండా వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం చొరవ చూపాలని సూచించారు.

**విద్యార్థులకు అండగా ఉంటాం**

విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎల్‌హెచ్‌పీఎస్ నిరంతరం పోరాడుతుందని నాయకులు తెలిపారు. విద్యార్థులు శాంతియుతంగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే సమయంలో వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుగులోతు హరి నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోడ లక్ష్మణ్ నాయక్, అడ్వకేట్ మోహన్ నాయక్, మహిళా సంఘం నాయకురాలు స్వర్ణలత తదితరులు పాల్గొని విద్యార్థులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలి: కలెక్టర్ దివాకర టీఎస్





**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 20 (దేశ టైమ్స్):**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్--2026) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా గుర్తించిన నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, ధ్రువపత్రాల పరిశీలన వరకు ప్రతి దశను పక్కాగా నిర్వహించాలని సూచించారు. గురువారం ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండలంలోని వి. వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నోటీసులు అందుకున్న ఓటర్లతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నోటీసుల జారీకి సంబంధించిన రికార్డులు, ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న ధ్రువపత్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌లో ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్ల గుర్తింపు, ఓటరు వివరాల్లో వ్యత్యాసాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఫారాల పంపిణీ, సేకరణ పూర్తయిన అనంతరం నో మ్యాపింగ్, వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయాలన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత గడువులో హాజరై తమ పౌరసత్వాన్ని నిర్ధారించే ధ్రువపత్రాలను సమర్పించేలా బీఎల్‌ఓలు, అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలను నిబంధనల మేరకు పరిగణనలోకి తీసుకుని ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించడంతో పాటు, అక్టోబర్ 15 వరకు నోటీసులు జారీ చేసి తదుపరి ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామాల పరిధిలో చేపట్టాల్సిన చర్యలకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని నిర్ణీత గడువులో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. ధ్రువపత్రాల స్వీకరణకు తేదీ, సమయాలను ముందుగానే నిర్ణయించి ఓటర్లకు సమాచారం అందించాలని తెలిపారు. అలాగే అనామలీస్, నో మ్యాపింగ్ కేసుల్లో బీఎల్‌ఓల ద్వారా నోటీసు ప్రతిని తప్పనిసరిగా అందజేసి, ఓటరు నుంచి స్వీకరణ ధ్రువీకరణ తీసుకుని రికార్డుల్లో భద్రపరచాలని ఆదేశించారు. ఎస్ఐఆర్‌లో నోటీసుల జారీ, ధ్రువపత్రాల స్వీకరణ, పరిశీలన, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం వంటి ప్రతి దశను అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని కలెక్టర్ అన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం తహసీల్దారు శ్వేత, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ అన్సారి, వి. వెంకటాయపాలెం గ్రామ సర్పంచ్ కాపా ఆదినారాయణ, బీఎల్‌ఓలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280